# ఆత్మగతం*

[కథానిక]

✵

## = శ్రీ గోపీచంద్ =

లీల మేడకిటికీదగ్గరకు వచ్చి ఆకాశంకేసి చూచేసరికి మబ్బులు కమ్ముకున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్లాలనిపించింది.

లీలకి వివాహమై రెండుసంవత్సరా లయింది. ఈ రెండుసంవత్సరాలనుంచీ, ఎన్నడూ ఆమె కిటువంటి ఆలోచన కలగలేదు. ఇంచుమించు ఆమె తల్లిదండ్రులని మరిచిపోయిందనే చెప్పాలి.

"పోనీ, ఒకసారి వెళ్లి రారాదూ?" అనేవాడు ఆమెభర్త మోహన్.

"వాళ్లు రమ్మనందే?" అనేది లీల.

లీలపుట్టింటివారు తమని రమ్మనరని మోహన్‌కి తెలుసు. లీల తనని వివాహం చేసుకోటం వారి కెవరికీ ఇష్టంలేదు. లీలసౌందర్యాన్నిగురించీ, తెలివితేటలనిగురించీ, జాతకాన్నిగురించీ వారికి గొప్ప అభిప్రాయం వుండేది. మోహన్ లీలకి తగిన వరుడు కాదని వారి అందరి అభిప్రాయమూను. వారు లీలకి అనేక విధాల బోధించిచూశారు. మోహన్‌లో వున్న లోపాలు గోరంతలు కొండంతలు చేసి చెప్పారు.

"అతనికి సంపాదనమీద దృష్టిలేదు" అన్నారు.

అప్పుడు ఇదొక లోపంగా కనపడలేదు లీలకి. "సంపాదనమీద దృష్టి సామాన్యమానవులకి వుంటుంది. మోహన్ అసాధారణవ్యక్తి" అనుకొన్నది.

"అతనిది నిలకడలేని మనస్సు" అన్నారు.

అప్పు డిదొక లోపంగా కనపడలేదు లీలకి. "మోహన్ కళోపాసకుడు; నిత్యనూతనుడు; ఎప్పటికప్పుడు నూతన అనుభవాలను జీర్ణించుకొని పరిపూర్ణత్వసిద్ధికోసం ప్రయత్నించే మేధాసంపన్నుడు" అనుకొన్నది.

వారింకా అనేకం చెప్పారు. వారు మోహన్నిలా అపార్థంచేసుకోటానికి అతని సౌందర్యపిపాసే కారణం అనుకొన్నది లీల. వారి అమాయికత్వానికి నవ్వుకొన్నది. "మోహన్-తన మోహన్-ఈ సాధారణ మానవులకి అర్థం అవుతాడా?" అని మురిసింది.

చివరకి, పుట్టింటివారి కెవరికీ యిష్టం లేకపోయినా మోహన్‌ని వివాహంచేసుకుంది. తల్లిదండ్రులుగాని, అన్నగాని, చెల్లెలుగాని, ఎవరూ తన వివాహానికి రాలేదు. మహదానందంలో తేలిపోతున్న లీలకి, తనవారెవరూ రాలేదని అనిపించలేదు. ఊళ్లో వున్న కవులూ, రచయితలూ, కళాజీవులూ, అంతా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నిత్యనూతనత్వంకోసం తపించిపోయే మోహన్‌కి దివ్యజ్యోతి దొరికిందని అభినందించారు. వారి ప్రశంసలకి లీల పరవశత్వం పొందింది. ఇంత ఉత్తమ పురుషునికి భార్య అయినందుకు గర్వించింది. తన జీవితం మోహన్ ఆదర్శసాధనకు సహాయం చెయ్యటానికై అంకితం చెయ్యాలని నిశ్చయించుకుంది.

వివాహం కాగానే లీలామోహనులు వినోదంగా

---

* ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంవారి సౌజన్యంతో.

కాలక్షేపం చెయ్యాలనే ఉద్దేశంతో పుణ్యక్షేత్రాలూ, ప్రముఖస్థానాలూ, రమణీయదృశ్యాలూ చూచిరావటానికి బయలుదేరారు. శ్రీరంగం, కంచి, మధుర, అజంతా, హంపీ, ఎల్లోరా మొదలైన ప్రదేశాలు దర్శించారు. హంపీ, అజంతా దృశ్యాలను చూచినప్పుడు లీలహృదయం నీరయింది. వాటి వైభవాన్నీ, వాటి పూర్వచరిత్రనీ, ప్రస్తుత స్థితినీ మోహన్ ఆమెకు కళ్లకి కట్టినట్టు వర్ణించి చెప్పాడు. హంపీక్షేత్రంలోని శిల్ప చాతుర్యాన్నీ, అజంతా గుహలలోని చిత్ర నైపుణ్యాన్నీ వివరించాడు.

"చూశావా మన పూర్వపు ఔన్నత్యం" అన్నాడు.

ఆమెహృదయం ఉప్పొంగింది.

"చూడు, ఈనాటి దీనావస్థ" అన్నాడు.

ఆమెహృదయం క్రుంగింది.

ఇంత వైభవాన్ని, ఇంతసౌందర్యాన్ని పోషించలేని, ఆనందించలేని జాతిమీద కోపం వచ్చింది. మోహన్‌వంటి రసహృదయులు, కళారాధకులు పదిమంది వుంటే దేశం ఇంత దౌర్భాగ్యస్థితికి వచ్చేది కాదు గదా అని చింతించింది. ఆక్షణం ఆమెకళ్లకి మోహన్ దివ్యమూర్తిగా కనిపించాడు; మూర్తీభవించిన ప్రకృతిలాలిత్యంగా కనిపించాడు.

"నామోహన్, నా మోహన్" అనుకుంది; తన్మయత్వం చెందింది. మోహన్‌చేత అనేక ఘన కార్యాలు చేయించాలని మనస్సులో నిశ్చయించుకుంది.

దంపతులిద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు....

మోహన్ చిత్రకారుడు. పిత్రార్జితం తక్కువ. అందువల్ల ఆర్థికంగా తరచు అనేకబాధలు పడుతూ వుండేవాడు. ఈ సంగతి లీలకి తెలుసు. వివాహానికి ముందే తన కుటుంబపరిస్థితులూ, ఆర్థికమైన చిక్కులూ అన్నీ ఆమెకు చెప్పాడు. ఆమె అతని నిష్కపట స్వభావానికి సంతోషించింది.

"ఎంత అలౌకిక్యలు" అన్నది మురిపెంగా.

"ఏమిటది?" అని మోహన్ ఆదుర్దాగా అడిగాడు.

"వివాహం చేసుకునే స్త్రీకి ఇలాంటి సత్యాలు తెలియనిస్తారా?" అన్నది.

"మరి నీయిష్టం" అన్నాడు మోహన్.

"నా కెప్పుడూ ఇష్టమే" అన్నది లీల

ఈ సంభాషణ ఎప్పుడూ లీలకి మనస్సులో మెదులుతూనేవుంది. అందుకనే, ఇంటికి రాగానే కుటుంబం క్లుప్తంగా జరపాలని సంకల్పించుకొని మోహన్‌తో మాట్లాడుతుంది.

"నీయిష్టం" అన్నాడు మోహన్. "ఇద్దరం—మనకి జరగదా?" అని చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వు లీల అర్థంచేసుకుంది. మోహన్‌కి పిల్లలంటే ఇష్టంలేదు. తనకూ పిల్లలు కావాలని లేదు. గంపెడు పిల్లలని పెట్టుకుని, సంసారం యీదలేక, చీదరించుకుంటూ బ్రతికే దంపతులను ఆమె అనేకమందిని చూచింది. ఎందుకనో కళకు, పిల్లలకు పడదని ఆమెనమ్మకం. మోహన్‌ని - తనమోహన్‌ని- కళోపాసకుడైన మోహన్‌ని పిల్లలతండ్రిగా ఆమె ఊహించుకోలేకపోయింది.

మోహన్ తన్మయత్వంతో చిత్రం గీసుకుంటూ వుంటాడు. చిన్న కొడుకు 'నాన్నా' అంటూ దగ్గరకు వెడతాడు. మోహన్ ఉలిక్కిపడి ఏదో లోకం లోనుంచి క్రిందికి చూసినట్టు చూస్తాడు. కొడుకు "కానీ" అంటాడు.

కూతురు వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు; ఎప్పుడు పూర్తిఅవుతుందా అనే తహతహతో వుంటాడు. "నాన్నా" అంటుంది కూతురు. కుంచె చేత్తో పట్టుకుని మోహన్ తిరిగి చూస్తాడు. "ఎత్తుకో" అంటుంది కూతురు.

తను వొస్తుంది. మోహన్ చిత్రం గీసుకుంటూ వుంటాడు. "మోహన్, నామోహన్" అని పిలుస్తుంది. అతను ఆశగా తిరిగి చూస్తాడు. తనని చూచి నిర్విణ్ణుడౌతాడు. తను తనుగా లేదు. ఇప్పుడు పిల్లలతల్లి. సౌందర్యం నశించింది, యౌవనం సడలింది, శరీరం ముడతలు పడింది.

"ఎవరు నువ్వు?" అంటాడు మోహన్.

"నీ లీలని" అంటుంది తను.

"కాదు, కాదు" అంటాడు మోహన్. చేతులోని కుంచె జారవిడుస్తాడు. ప్రక్కనున్న కుర్చీలో కూలబడతాడు.

"వొద్దు, పిల్లలు వొద్దు" అనుకుంది లీల, పైవిధంగా ఊహించుకుని.

అప్పటినుంచీ లీల ఇల్లు కదలదు. షికారు వెళ్లదు. ఆప్తులను కూడా చూడదు. ఎప్పుడూ మోహన్ సరసనే వుండేది. చిత్రరచనకు కావలసినవన్నీ అమర్చి పెట్టేది. అతనికే యిబ్బందీ కలగకుండా చూస్తూవుండేది. తనకి సొంత జీవితమనేదే లేకుండా చేసుకుంది. మోహన్ జీవితమే తన జీవితం.

ఈ పథంగా రోజులు గడుస్తున్నై. మోహన్ చిత్రాలమీద చిత్రాలు గీస్తున్నాడు. ఎప్పుడూ లీల అతని ప్రక్కనే వుండాలి. లీల లేకపోతే అతనికుంచె నడవదు. ఆమె వొక్క క్షణం కనిపించకపోతే వెర్రివాడిలాగ 'లీలా, లీలా' అంటూ వెతికేవాడు.

అతను తనకోసం ఇంత తపించిపోవటం లీల మనస్సుకి అమిత ఆనందాన్ని కలిగించేది. తన సౌందర్యం మోహన్ చేత అనేక చిత్రాలు గీయించటానికి కారణభూతం అయినందుకు ఆమెశరీరంలోని ప్రతి అణువూ గర్వించింది.

"నా పిచ్చి మోహన్! నేను లేకపోతే ఏమైపోయేవాడివో" అని ముంగురులు సవరించేది.

"నీవు లేనినాడు ఈ మోహన్ లేడు" అనేవాడు మోహన్.

ఈమాట ఆమెహృదయాన్ని ఎంత కదిలించేదని! మళ్లీ మళ్లీ ఆమాటే అతనితో చెప్పించుకొని వినాలని ఉవ్విళ్లూరేది.

సాధారణంగా వారు ప్రతిసాయంకాలమూ పెరటిలో వున్న జాజిపూపొదరింటిలో కుర్చీలు వేసుకుని కూర్చునేవారు. అటువంటి సమయాల్లో పునుగు, జవ్వాది, మంచిగంధం మొదలైన పరిమళద్రవ్యాలు వెంట తీసుకురావటం అతనికి అలవాటు. ఆ పరిమళద్రవ్యాలను పదిలంగా ఆమెప్రక్కన వుంచి, చక్కగా విచ్చిన సన్నజాజుల నిన్ని పుణికి ఆమెతలలో తురిమేవాడు. సుగంధద్రవ్యాలను ఆమెకంఠసీమకు రాసి తన చేతుల కింత పట్టించుకొనేవాడు. ఆ మత్తెక్కించే సువాసనల్లో ఆమెకు పుస్తకాలు చదివి వినిపించేవాడు. ఆ పుస్తకాలామెకి అర్థమయేవి కావు. అతను మునివేళ్లతో పేజీలు త్రిప్పటంమాత్రం ఆమెను ప్రబలంగా ఆకర్షించేది.

అతను మధ్యమధ్య "ఓహో, ఏమి మహోన్నత భావాలు" అనేవాడు. ఆమె 'అవును' అనేది, అతని మునివేళ్ల వంక చూస్తూ.

"లీలా, ఇలా చదువుకుంటూ, చిత్రాలు గీసుకుంటూ ఒకరిచెంత వొకరు ప్రపంచంలో వున్న కీచులాటల కతీతంగా జీవించటంకంటే ఇంకేం కావాలి?" అనేవాడతను.

'అవును' అనేది లీల, అతని మునివేళ్ల వంక చూస్తూ.

"లీలా, మనం ఆదర్శదంపతులం కామా? ఎంత అదృష్టవంతులము" అనేవాడు మోహన్ ఆమెను తన కౌగిలిలోకి తీసుకుంటూ.

ఆక్షణం ఆమెకు స్వర్గలోకంలో మందాకినిలో స్నానం చేసినట్టు వుండేది. కాని, మరుక్షణమే లోపలనించి ఏదో ఆవేదన - అసంతృప్తి పుట్టుకొచ్చేవి. అలా అసంతృప్తి కలగటం తన లోపమే అనుకొనేది లీల. మోహన్ వెడుతున్న స్థాయిని తను అందుకోలేక పోతున్నందుకు తన్నుతాను నిందించుకొనేది.

వెంటనే ఆమెకు కుటుంబపరిస్థితులు జ్ఞాపకం వచ్చేవి. ఊళ్లో వున్న కళాజీవులందరూ మోహన్ చిత్రాలను పొగడేవారే. కాని, అతని చిత్రాలను కొనేవాళ్లెవరూ కనిపించరు. ఎవరో ఒకరు తప్పకుండా వస్తారనుకొనేది లీల. "ఎక్కడో ఒక రసహృదయుడు వుండి వుండకపోతాడా, ఎప్పటికో వొకప్పటి కతను రాకపోతాడా" అని నిరీక్షిస్తూవుండేది లీల.

ఒకనాడు అతను రానేవచ్చాడు. తన కొక చిత్రం వ్రాసిపెట్టమని మోహన్ని కోరి వెళ్లిపోయాడు.

మోహన్ ఆ చిత్రరచనకి పూనుకున్నాడు. తన చాతుర్యాన్నంతా చూపి గొప్ప చిత్రాన్ని సృష్టిస్తానన్నాడు లీలతో. లీల చిత్రం త్వరగా పూర్తి చెయ్యమని తొందరపెట్టింది. ఎక్కడ ఆలస్యమై పోతుందో అనే భయంతో అతనికి కావలసిన వస్తువులన్నీ అడగకుండానే అందించేది. రంగులు నిండుకుంటున్నై. కుంచెలు మారిపోతున్నై. క్రమక్రమేణా చిత్రం మానవాకృతిని దాల్చింది. ఆచిత్రాన్ని చూచుకొని మోహన్ ఉప్పొంగిపోయాడు. ఆ చిత్రంలో తాను స్ఫురింపజేసిన భావాలను లీలకు విప్పిచెప్పేడు. ఆమెకుకూడా అదొక బ్రహ్మాండమైన కళాఖండంగా కనిపించింది. ఇద్దరూ ఆనందపరవశులయారు.

మర్నాడు ఆచిత్రం వ్రాయమని కోరిన పెద్ద మనిషి వచ్చాడు. మోహన్ అతనికి చిత్రం చూపించాడు. అత నేమంటాడో అని ఆతురతగా చూస్తూ నుంచుంది లీల. ఆ పెద్దమనిషి చిత్రాన్ని పరిశీలించి చూచాడు.

"అబ్బే" అని చప్పరించాడు.

"ఏమిటి?" అని అడిగాడు మోహన్. అతనికి ప్రపంచం అంతా గిర్రుమని తిరుగుతూవున్న ట్లనిపించింది.

"ఇదేం బొమ్మ?" అన్నాడు పెద్ద మనిషి.

"ఏం?" అని అడిగాడు మోహన్.

"నేను వ్రాయమన్నది ఇలా కాదు" అన్నాడు పెద్ద మనిషి.

మోహన్‌కి కోపం ఎక్కువ అయింది. "ఈ సంస్కారం లేనివాడు వ్రాయమనటం, తను వ్రాయటమూనా?" అనిపించింది. అతను వ్రాయమన్నట్టు తను వ్రాయనందుకు లీలగా సంతోషం కలిగింది.

"నా ఇష్టం వచ్చినట్టు నేను వ్రాశాను" అన్నాడు.

"అయితే బొమ్మ మీరే వుంచుకోండి" అన్నాడు పెద్ద మనిషి.

"సరే, మీరు వెళ్లండి" అన్నాడు మోహన్.

ఆ పెద్దమనిషి గబగబ వెళ్లిపోయాడు. లీలకి ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే నిర్విణ్ణురాలై చూస్తూ నిలబడింది.

అతను వెళ్లిపోగానే మోహన్ కోపోద్రేకంతో వొళ్లు మరిచిపోయాడు. "మూర్ఖులు, సంస్కారశూన్యులు, కళాదరిద్రులు." అని ఏమేమో గొణుక్కోటం మొదలుపెట్టాడు. లీలమొహం చూడలేకపోయాడు. లీల హృదయం ముక్కలై వుంటుందని అతనికి తెలుసు. ఆమెముఖంలో తాండవించే నిరాశను చూడటాని కతనికి భయం వేసింది. బయటికి వెళ్లిపోయాడు.

చేతనారహితంగా నిలబడిపోయింది లీల. ఎంతసేపు అలా నిలబడిందో ఆమెకే తెలియదు. తాము అహోరాత్రాలు కష్టపడి పూర్తిచేసిన చిత్రం ఎదురుగుండా కనిపిస్తోంది. తన వంకకే చూస్తున్నట్టుంది. ఆ చిత్రాన్ని తయారుచెయ్యటానికి తాము ఉపయోగించిన రంగులూ, కుంచెలూ అక్కడే వున్నాయి; తన వంకకే చూస్తున్నాయి. మోహన్‌చేత గొప్ప చిత్రాన్ని వ్రాయించటానికి తాను పడిన శ్రమతో ఆ గది వుడికిపోతూవుంది. ఆ గదిలోని ప్రతివస్తువూ ఆ సంగతే చాటిచెపుతూవుంది. ఆమె అక్కడ నిలబడలేకపోయింది. భారంగా అడుగులు వేసుకుంటూ కిటికీ దగ్గరకు నడిచింది. ఆకాశంకేసి చూచేసరికి మబ్బులు కమ్ముతున్నై. అకస్మాత్తుగా ఆమెకు పుట్టింటికి వెళ్లాలనిపించింది. ఎన్నడూ లేనిది ఇప్పుడిలా ఎందుకనిపించింది? ఆలోచించింది. ఒక్కసారి తన జీవనం అంతా జ్ఞాపకంవచ్చింది లీలకి. తన జీవితం అంతులేని అఘాతంగా కనిపించింది. తల్లీ, తండ్రీ, అన్నా, చెల్లెలూ అంతా జ్ఞాపకంవచ్చారు.

"అమ్మా, నువ్వు చిన్నదానవు, నా మాట విను" అన్నాడు తండ్రి.

"ఆయనమనస్సు వెన్నపూస, నాన్నా" అన్నది తను.

"అది సుగుణం కాదమ్మా. జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవటంవల్ల వచ్చే బలహీనత" అన్నాడు తండ్రి.

"చూడు, నాన్నా, వారికి ఆడవాళ్లంటే ఎంత భక్తోను" అన్నది తను.

"ఆడవాళ్లంటే భక్తేమిటమ్మా!" అన్నాడు తండ్రి.

"కాదు, నాన్నా. స్త్రీలంటే వారికి ఎంతో గౌరవం. ఎంత మెత్తగా, ఆహ్లాదకరంగా మాట్లాడతారు" అన్నది తను.

"అందరి స్త్రీలనూ ఒకేరకంగా చూడగలిగిన వాడు భార్యను సుఖపెట్టలేడు, తల్లీ" అన్నాడు తండ్రి.

ఇప్పుడు తన తండ్రిమాటలు నిజమేనేమో అనిపించింది లీలకి. మోహన్ గీసిన చిత్రాలు చూడటానికి అనేకమంది ఆడవాళ్లు వస్తూవుండేవారు. వాళ్ల అందరితోనూ తనతో వుండేటట్టుగానే చాలా చనువుగా వుండేవాడు మోహన్. వాళ్లందరికీ పునుగు, జవ్వాది, మంచిగంధం ఇస్తూవుండేవాడు. సన్నజాజి పువ్వులు కోసి, దండలుగా గుచ్చి వాళ్లకి ఇస్తూవుండేవాడు. మోహన్‌దృష్టిలో తనూ, తక్కిన స్త్రీలూ ఒకటేనా? భేదం లేదూ? తనమీద ప్రత్యేకంగా ప్రేమలేదూ మోహన్‌కి? స్త్రీలని ఆరాధించటం అతని స్వభావం. తనని ఆరాధించటానికి కూడా ఇదేనా కారణం? తన ప్రత్యేకత కాదూ? తన సౌందర్యం కాదూ? తన బుద్ధికుశలత కాదూ? పోనీ, తన భక్తిఅయినా కాదూ?

ఈ ఆలోచనలతో ఆమె హృదయంలో తుపాను రేగింది. చూపులు వీథివైపు మరలించింది. వీథిలో స్త్రీలూ, పురుషులూ గందరగోళంగా ఇటూ, అటూ పరిగెత్తుతున్నారు. ఆమె కంతా కొత్తగా కనిపించింది. మోహన్‌తోపాటు ఊహాసౌధాలలో నివసిస్తున్న ఆమెకి ప్రపంచమే కొత్తదైపోయింది. అటు చూడలేక మొహం మరొకవైపు త్రిప్పింది. అక్కడ కొంతమంది పిల్లలు ఆడుకుంటున్నారు. తనూ, మోహన్ పిల్లలు కలగకూడదని చేసుకున్న నిశ్చయం జ్ఞాపకంవచ్చింది. వెంటనే తన స్నేహితురాలు విమల తలపుకివచ్చింది.

విమల తన చిన్ననాటి స్నేహితురాలు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఒకసారి తన వివాహమైన తరవాత తనని చూచిపోదామని వచ్చింది. విమలని చూస్తే తనకి ప్రాణం లేచివచ్చింది. ఆమెకు మోహన్ గీసిన చిత్రాలన్నీ చూపించింది. మోహన్‌యొక్క గొప్పతనాన్ని గురించి చెప్పింది. అతని ఉన్నతభావాలను పొగిడింది. విమల అన్నీ విని, "సరే, మరి నువ్వేం చేస్తున్నావు?" అని అడిగింది.

"నేనా...?" అని తబ్బిబ్బుపడ్డది తను. ప్రత్యేకం తనేమీ చెయ్యటం లేదనీ, ఏదో వొకటి చెయ్యవలసిన బాధ్యత తనమీద వున్నదనీ అప్పుడు తెలిసింది తనకి.

"ఏమీ చెయ్యటం లేదు" అన్నది తను.

"ఎందుకని?" అని అడిగింది విమల.

"మోహన్ నేను ప్రక్కని లేనిదే చిత్రాలు వ్రాయలేడు." అన్నది తను.

"అదేమిటి లీలా? నువ్వు చదువుకున్నదానివి. నీకుమాత్రం నీ సొంతజీవితమనేది వుండక్కర్లా?" అన్నది విమల.

"నాకు అవసరం అనిపించటం లేదు. మోహన్‌కి సహాయం చెయ్యటంలోనే నాకు ఆత్మానందం కలుగుతోంది." అన్నది తను.

ఈ మాటకి విమల తనవైపు వింతగా చూసింది. ఆ చూపులు ఇప్పటికీ తనని వెన్నాడి, ములుకులుగా గుచ్చుకుంటున్నై. విమల సంఘసేవ చేస్తూవుందట. సంఘంలో స్త్రీలూ, బీదవాళ్లూ పడుతున్న కష్టాలను గురించి, వాటి నివారణోపాయాలనుగురించి గంటసేపు మాట్లాడింది. "పురుషుడికి బానిసగా వుండటం కాదు, స్త్రీకి సొంతజీవితం వుండాలి. స్త్రీకూడా మనిషే. ఆమెకూ సొంత ఆలోచనలూ, సొంత ఆవేదనలూ వుంటాయి. అవి తీర్చుకోవాలి" అని చెప్పింది. చివరకి వెడుతూ వెడుతూ "మీ మోహన్ చాలా స్వార్థపరుడుగా కనిపిస్తున్నాడు లీలా. ఎంతసేపూ తన సుఖమే కాని నీ సంగతి ఆలోచిస్తున్నట్టే లేదు" అన్నది విమల.

"అయ్యో, వారి నలా అనకు" అన్నది తను.

"మరి ఆయన చేస్తూన్న పనేమిటి?"

"వారు నన్ను చెయ్యమన్నారా? నాకు ఇష్ట మయే చేస్తున్నాను."

"నీకు ఇష్టంఅయితేమాత్రం? ఆయన తెలిసిన వాడుగదా, నీకు తెలియచెప్పవలసిన బాధ్యత ఆయన మీద లేదూ?"

లీల ఆలోచించింది. తనకు సొంతజీవితం అనేది లేదా? విమలమాటల్లో ఎంతవరకు సత్యం వుంది? తనకు సొంతజీవితం లేకపోవటం ఏమిటి? మోహన్ కి ఉత్సాహం కలిగించి అతనితో గొప్పగొప్ప చిత్రాలు గీయించటం, ఘనకార్యాలు చేయించటం అదే తన జీవితం. ఒకరికి సహాయం చెయ్యకుండా ఎవరికి వారే ఒక చిన్న ప్రపంచాన్ని సృష్టించుకొని కూచుంటే, ప్రపంచంలో సఖ్యత ఎలా వుంటుంది? సహకారం ఎలా కుదురుతుంది? అభివృద్ధి ఎలా జరుగుతుంది? మరి తన కెందు కీ అసంతృప్తి? ఎవరిమీద? దేనికోసం? తనమీద తనకే కాదుగదా. ఇదివరకు ఉత్సాహం, ఆనందం ఇచ్చే విషయాలు ఇప్పుడు తన కెందు కివ్వక పోవాలి? తప్పు ఎవరిది? తనదా, మోహన్ దా? మోహన్ తప్పేమి వుంది? ఎంత వితర్కించుకున్నా, అతని తప్పు కనిపించటంలేదు. తన్ను మొదటినుంచీ ఎంత ఆప్యాయంగా, ప్రేమగా చూస్తున్నాడో, ఇప్పుడూ అదేవిధంగా చూస్తున్నాడు. అతనిలో రవ్వంత మార్పుకూడా లేదు. అవే ఆలోచనలు...అవే మార్పులు...అవే చర్యలు...అదే దృష్టి...ఇక అతని తప్పేమి వుంది? పోనీ, తనుమాత్రం ఏం చేసింది? మోహన్ని సంతోష పెట్టటానికి తనకు చేతనయినంత వరకూ ప్రయత్నిస్తూనేవుంది. అతన్ని ఇంకా గాఢంగా ప్రేమిస్తూనేవుంది. కాని, ఇదివరకు తన్ను అంతగా కదిలించిన మాటలు ఇప్పు డెందుకు కదిలించలేకపో తున్నై? ఇదివరకు అతడు చెంతన కూర్చుంటేనే పర వశత్వం కలిగేది. ఇప్పుడు విసుగుపుడుతూవుంది. అతని మాటల్లోని మెత్తదనం మొహం మొత్తుతూవుంది. కొంచెం గట్టిగా, దర్జాగా ఎందుకు మాట్లాడడు? ఆయ నకు కోపం వొస్తే చూడాలనిపించేది తనకి. ఆయన కేకలు వేస్తే ఎలా వుంటుంది?

తన వివాహానికి ముందు తను తన స్నేహితు రాండ్రతో వున్నప్పుడు ఆయన వొచ్చి, తన సరసన కూర్చొని మాట్లాడుతుంటే తన కెంతో గర్వంగా వుండేది. ఇప్పుడు ఇతరుల ఎదట ఆయన తనదగ్గరగా ఉంటేనే సిగ్గుగా, ఎల్లాగో ఉంటూవుంది. ఎందుకని? వాళ్లేమన్నా అనుకుంటారనా? ఇదివరకు ఇతరులు అలా అనుకోవటం గర్వకారణంగా ఉండేది. ఇప్పుడు ఎందుకని?

తాను మారిందా? మారటానికి అతడు ఆర్జిం పకపోవటం కారణమా? ఆర్జన లేకపోవటం అనేది ఆయనకూ వున్న బాధేగా. కాని ఆయన బాధపడు తున్నట్లు కనపడడు.

పోనీ, విమల చెప్పినట్లు సంఘసేవ చేస్తే? అప్పుడు తన మోహన్ ఏమవుతాడు? తాను ఇప్పటికి మల్లే ప్రేమించగలుగుతుందా? ఒకవేళ ప్రేమించ లేకపోతే? ఒక్కసారి ఆమెకు జీవితం ఎడారిగా కనిపించింది. అనేక ఊహలతో ఉక్కిరిబిక్కిరి అవు తున్న ఆమెహృదయం అకస్మాత్తుగా శూన్యం అయింది. మోహన్ని - తన మోహన్ని ప్రేమించలేక పోవటమే!

"లీలా?"—ఎవరి దాపిలుపు? ఎక్కడ విన్నది ఆపిలుపు? అజంతా - హంపీ - శ్రీరంగం - కంచి - మథుర - ఎల్లోరా.

మోహన్ గదిలోకి వొచ్చాడు. ఏదో ఆతుర తగా చెప్పబోయాడు. ఆమెకళ్లల్లో అశ్రువులు చూశాడు.

"ఇదేమిటి?" అని అడిగాడు.

"ఏమీ లేదు" అన్నది లీల.

వెంటనే రహస్యాలు ఉంచుకోగూడదని తాము చేసుకున్న నిశ్చయం జ్ఞాపకంవచ్చింది. కాని ఏమని చెపుతుంది?